క్లుప్తంగా

ఘనంగా గ్రామోత్సవం



శ్రీకృష్ణ విగ్రహ గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

కడప సెవెన్‌రోడ్స్ : త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందు జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం కడప నగరంలో శ్రీకృష్ణ విగ్రహ గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా స్థానిక అక్కాయపల్లె తిలక్‌నగర్‌లో శ్రీకృష్ణ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఐదవ రోజు భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భగవద్గీత శ్లోకాలను పఠించారు. అనంతరం విగ్రహాన్ని అక్కాయపల్లె నుంచి శాస్త్రినగర్, బాలాజీనగర్, కాగితాలపెంట, నబీకోటలలో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు దైవ దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జ్ఞాన వేదిక కడప కమిటీ అధ్యక్షులు బి.నవనీశ్వర్‌రెడ్డి, ప్రతినిధులు ఆర్వీ పెరుమాళ్లు, సి.ఈశ్వరయ్య, జి.యల్లారెడ్డి, పి.సదానందుడు, కె.సుదర్శన్, ఎస్.మణి, జి.శ్రీనివాసులు రెడ్డి, బి.సామ్రాట్, బి.వాసంతి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న శ్రీ సాయి యువజన సేవా సంఘం అధ్యక్షుడు ఎం. చంద్రశేఖర్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : కడప నగరంలో జిల్లా పరిషత్ ఆవరణంలో ఉన్న ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో శ్రీ సాయి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం ఛైర్మెన్ మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తమ సోదరుడు ఎం. శివానందరెడ్డి ఏడో వర్ధంతి సందర్భంగా అన్నదానం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎం. క్రిష్ణారెడ్డి, లతారెడ్డి, లెనిన్ నరసింహ, డి. సుబ్బరాయుడు, శివశంకర్, వసతి గృహ నిర్వాహకులు శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

నగరపాలక సూపరింటెండెంట్ శ్రీనివాసులు మృతి



మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థలోని పబ్లిక్ హెల్త్ విభాగంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న అన్నదానం శ్రీనివాసులు(51) ఆకస్మికంగా మృతి చెందారు. కొన్నాళ్లుగా నోటి క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన మంగళవారం రాత్రి రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న నగరపాలక కమిషనర్ మనోజ్ రెడ్డి, 2వ డివిజన్ కార్పొరేటర్ సుబ్బారెడ్డి, నగరపాలక అధికారులు, సిబ్బంది దేవుని కడపలోని ఆయన స్వగృహానికి వచ్చి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

24న పుస్తకావిష్కరణ

కడప సెవెన్‌రోడ్స్ : కొత్తపల్లి రామాంజనేయులు రచించిన 'ఉదయ సింధూరం' అనే ఆధ్యాత్మిక, చారిత్రక, సాహిత్య, సంస్కృతీ వ్యాస సంపుటి పుస్తకాన్ని ఈనెల 24వ తేది ఆవిష్కరించనున్నట్లు రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొందూరు జనార్దన్‌రాజు తెలిపారు. రాయలసీమ టూరిజం, ఇంటాక్, పోతుల చిన్న ఓబుల్‌రెడ్డి, కంచమ్మ, సరస్వతమ్మ మెమోరియల్ ట్రస్టు సంయుక్తాధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుందన్నారు. ఆరోజు ఉదయం 10 గంటలకు హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో కవులు, రచయితలు హాజరు కావాలని కోరారు.

రాజీవ్ గాంధీ ఆశయాలను నెరవేర్చాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఆశయాలను నెరవేర్చాలని కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ సిరాజుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ 81వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మహిళా కాంగ్రెస్ కడప జిల్లా మాజీ అధ్యక్షురాలు శ్యామల ఆధ్వర్యంలో నిర్వహించారు.

గణనాథుని పందిళ్ల సందడి

- కూడళ్లకు తరలుతున్న విగ్రహాలు
- నిబంధనలు పాటించాలని పోలీసుశాఖ సూచన



ఎన్జీఓ కాలనీలో రూపుదిద్దుకుంటున్న వినాయక చవితి పందిరి



కో ఆపరేటివ్ కాలనీలో పందిరి నిర్మాణం

కడప సెవెన్‌రోడ్స్ : వినాయక చవితి పండుగ ఈనెల 27వ తేది నిర్వహించుకోనున్నాం. ఈ పండుగ అంటే పిల్లల నుంచి వృద్ధుల వరకు ఎంతో ఉత్సాహం. మూడు రోజులపాటు పందిళ్లలో స్వామి వద్ద పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల మధ్య ప్రజలు ఆనందంగా గడుపుతారు. కడప నగరంలో భారీ పందిళ్ల నిర్మాణం మొదలైంది. పండుగ సమీపిస్తూ ఉండడంతో ప్రధాన రోడ్లపైనే కాక వీధి కూడళ్లు, సందు గొందుల్లో కూడ చవితి పందిళ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నారు. కొన్నిచోట్ల పందిళ్ల నిర్మాణం ఓ దశకు చేరుకుంటూ ఉండగా, మరికొన్నిచోట్ల పందిళ్ల కోసం అవసరమైన సరంజామాను పందిరి ఏర్పాటు చేయనున్న స్థలం వద్ద సిద్ధం చేసి ఉంచారు.

కడప నగరంలోని ఎన్జీఓ కాలనీలో అత్యంత భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. పందిరి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. సుమారు రూ. 3.50 లక్షలు వెచ్చించి హైదరాబాదు నుంచి ప్రత్యేకంగా భారీ వినాయక విగ్రహాన్ని తీసుకు వచ్చి ఉంచారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన కార్మికులు భారీ పందిరి నిర్మాణ పనుల్లో నిమగ్నమయ్యారు.

కో ఆపరేటివ్ కాలనీలో కూడా పందిళ్ల నిర్మాణం సాగుతోంది. దొంగలచెరువు కట్టపై రాజీవ్ పార్కు వద్ద మరో భారీ వినాయక చవితి పందిరిని ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఈ పనులు ప్రారంభమై రెండు, మూడు రోజుల్లో పూర్తి కానుంది. మద్రాసు రోడ్డుతోపాటు నగరంలోని దాదాపు అన్ని కూడళ్లలో పందిళ్ల నిర్మాణం ప్రారంభమైంది. మరికొన్ని చోట్ల పెద్ద విగ్రహాలను ముందే తీసుకొచ్చి కూడళ్లలో ఏర్పాటు చేయనున్న వేదికల వద్ద సిద్ధంగా ఉంచారు. ఈ సారి పండుగ చాలా సందడిగా జరిగే అవకాశం ఉందన్న ప్రచారం జోరుగా సాగుతుండడంతో నగరం వెలుపల పెద్ద సంఖ్యలో వినాయక విగ్రహాల తయారీ సాగుతోంది. ఈ పరిస్థితి జిల్లా అంతటా ఉంది. పెద్ద, చిన్న తేడా లేకుండా గ్రామాల స్థాయి నుంచి మండలాలు, పట్టణాల స్థాయి వరకు పందిళ్లకు తరలేందుకు రంగురంగుల గణపతి విగ్రహాలు సిద్ధమవుతున్నాయి.

అనుమతి పొందాలి

పందిళ్ల ఏర్పాటు చేసుకోదలిచిన వారు తప్పనిసరిగా తమ పరిధిలోని పోలీసుస్టేషన్‌లో దరఖాస్తు సమర్పించాల్సి ఉంది. అనంతరం తప్పనిసరిగా డీఎస్పీ అనుమతి పొందాలి. రాత్రి సమయంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేవారు వాటి కోసం ప్రత్యేకంగా అనుమతులు తీసుకుని పోలీసుల సూచన మేరకు చలానా ద్వారా నిర్ణయించిన ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. పోలీసులు ఈ విషయంగా ఉత్సవ కమిటీ సభ్యులకు పలు సూచనలు జారీ చేయడంతో అనుమతులు లభించిన ప్రదేశాల్లో పందిళ్ల నిర్మాణం ప్రారంభమైంది. యువత రూల్స్‌కు అనుగుణంగా ఉత్సాహంగా పందిళ్లను ఏర్పాటు చేయడంతో మునిగిపోయారు. పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని పోలీసులు సూచించడమే కాక పందిళ్లు సీసీ కెమెరాల పరిధిలోకి వచ్చే ఏర్పాటు చేస్తున్నారు. పోలీస్ బందోబస్తు కూడ నిమజ్జనం పూర్తయేంత వరకు ఉంటుందని తెలిపారు. కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్, జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. పండుగ మనకు ఆనందాన్ని ఇవ్వడంతోపాటు ఇతరులకు ఏమాత్రం ఇబ్బందులు కలిగించకూడదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని పండుగ ఆనందాన్ని ఆస్వాదిద్దాం అన్నారు.

ఇలా జరుపుకుందాం!

పండుగను పూర్తి సాంప్రదాయబద్ధంగా, భక్తితో నిర్వహించుకోవాలని, ఆధునిక పోకడల పేరుతో విచ్చలవిడి తనం మంచిది కాదని పెద్దలు సూచిస్తున్నారు. దైవానికి చేసే పూజ గనుక తగిన పవిత్రతను పాటించాలని సూచిస్తున్నారు. పందిళ్ళ వద్ద పవిత్రతకు భంగం కలిగించరాదంటున్నారు. పెద్ద శబ్దాలు చేసేలా మైకులు పెట్టకూడదు. నిమజ్జనం రోజున మద్యం సేవించడం, అల్లరి చేయడం, తెలియని వారికి రంగులు పూయడం మంచిది కాదు. కాలక్షేపం కోసం పందిళ్ళను వాడుకోకూడదు. ఇతర మతాల ప్రార్థన సమయాలను గౌరవించాలి. వారి మత సంప్రదాయాలను కించపరచకూడదు.



రాజీవ్ పార్కువద్ద చురుగ్గా కొనసాగుతున్న పందిరి నిర్మాణం

పోలీసుల సూచనలు

పందిళ్ల వద్ద రాత్రిళ్ళు బాధ్యత గల భక్తుడైన కమిటీ సభ్యుడు కాపలా ఉండాలి. విలువైన విగ్రహాల బాధ్యత కమిటీయే తీసుకోవాలి. పందిళ్ళలోకి మద్యం సేవించి రాకూడదు. వాహనాలు పందిళ్ళకు దూరంగా ఉంచాలి. ద్విచక్రవాహనాలపై పందిళ్ళ సమీపంలో అతివేగం కూడదు. ప్రతి అంశాన్ని సిసి కెమెరాల్లో రికార్డు చేస్తారు. భక్తి కార్యక్రమాలు తప్ప అల్లరి పాటలు, డ్యాన్స్‌లు చేయకూడదు.

వినాయక నిమజ్జన ప్రదేశాల పరిశీలన



నిమజ్జన ప్రదేశాలను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని వినాయక నిమజ్జన ప్రదేశాలను నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి, ఆర్‌డీఓ జాన్ ఇర్విన్ పరిశీలించారు. బుధవారం క్రిష్ణా సర్కిల్ మీదుగా పాతకడప చెరువు, ఇర్కాన్ సర్కిల్, ఫాతిమా కాలేజ్ బిల్డప్, క్రిష్ణ కాలువ తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వినాయక నిమజ్జనం జరిగే ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచాలని, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాటు చేసి, నీటి వసతి కల్పించాలని, చెరువు కట్ట చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులకు సూచించారు. ఎలాంటి ప్రమాదాలు, పొరపాట్లు జరక్కుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌లు ధనలక్ష్మి, ఏ. విజయ్ కుమార్‌రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కడప టూటౌన్ సీఐగా సుబ్బారావు



కడప అర్బన్ : కడప టూటౌన్ సీఐగా జి.సుబ్బారావు బుధవారం బాధ్యతలను చేపట్టారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న బి. నాగార్జున రాజంపేట అర్బన్ సీఐగా బదిలీ ఆయ్యారు. ప్రస్తుతం బాధ్యతలను చేపట్టిన సీఐ జి. సుబ్బారావు గతంలో కడప కమాండ్ కంట్రోల్, ప్రొద్దుటూరు 3 టౌన్ పోలీస్ స్టేషన్ తో పాటు పలు ప్రాంతాల్లో పనిచేశారు. ఈ సందర్భంగా సీఐ సుబ్బారావు మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలను తీసుకుంటామని తెలియజేశారు.

ప్రశంసాపత్రాలు అందజేత





ఎస్పీ అశోక్‌కుమార్ నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) కె.ప్రకాష్‌బాబు, ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు

కడప అర్బన్ : జిల్లా వ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రతిభచాటిన పోలీసు అధికారులు, డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు, సిబ్బందిని కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ప్రశంసించారు. కాగా బుధవారం కడపలో నిర్వహించిన సమావేశంలో అదనపు ఎస్పీ (పరిపాలన) కె.ప్రకాష్ బాబుతోపాటు పలువురు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ అందచేశారు.

ప్రశంసా పత్రాలు అందుకున్న వారు

కె.ప్రకాష్ బాబు, అదనపు ఎస్.పి (పరిపాలన), బి.రమణయ్య, అదనపు ఎస్.పి (ఏ.ఆర్), ఎన్.సుధాకర్, డీఎస్పీ స్పెషల్ బ్రాంచ్, ఏ.వెంకటకేశ్వర్లు, డీఎస్పీ కడప, బి.మురళి, డీఎస్పీ పులివెందుల, పి.భావన, డి.ఎస్.పి, ప్రొద్దుటూరు, జి.రాజేంద్ర ప్రసాద్, డీఎస్పీ మైదుకూరు, కె.వెంకటేశ్వర రావు, డీఎస్పీ జమ్మలమడుగు, ఈ.బాలస్వామి రెడ్డి, డీఎస్పీ మహిళా పీఎస్, ఎస్.కె అబ్దుల్ కరీం, డీఎస్పీ డి.టి.సి, కె.శ్రీనివాస రావు, డీఎస్పీ ఏ.ఆర్, కడప, ఎస్.వినయ్ కుమార్ రెడ్డి, డీటీసీ ఇన్స్పెక్టర్, (కోర్ట్ మానిటరింగ్ సెల్, కడప ఇంచార్జ్), ఎం.డి రియాజ్ అహమద్, ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టర్, ప్రొద్దుటూరు, పి.ఈశ్వర్ రెడ్డి, ఇన్స్పెక్టర్, డీసీఆర్‌బీ, కడప.

- చోరీ కేసుల్లో అత్యుత్తమ పనితీరు కనబరచి చోరీ సొత్తు రికవరీ చేసిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు

జి.మధుసూదన్ రెడ్డి, ఎస్.ఐ, పెండ్లిమర్రి పి.ఎస్, ఎస్.కె బాషా, పీసీ, సీసీఎస్, కడప, ఎన్.రాజరాజేశ్వర రెడ్డి, ఎస్ఐ, చిన్నచౌకు పీఎస్, పి.ఖాదర్ హుస్సేన్, పీసీ, చిన్నచౌకు పీఎస్.

ఐటీ కోర్ టీమ్‌లో విశేష సేవలందించినందుకు..

బి.శ్రీనివాస్, పీసీ, ఐ.టి కోర్ టీమ్, కడప.

వివిధ విభాగాలలో..

- ఆర్.వి పెరుమాళ్ళు, హెచ్.సి, చిన్నచౌకు పి.ఎస్, ఎం.సుబ్బారాయుడు, హెచ్.సి 719, కోర్ట్ మానిటరింగ్ సెల్, కడప.
- ఆర్.ఎస్.ఏ.ఎస్.టి.ఎఫ్ ఇన్‌స్పెక్టర్ సి.శంకర్ రెడ్డి, ఆర్.ఎస్.ఏ.ఎస్.టి.ఎఫ్ కానిస్టేబుళ్లు సి.కొండయ్య, ఏ.ఎన్ కీర్తి.

శాస్త్ర విజ్ఞానంతోనే మానవ జీవితానికి ప్రగతి

కడప ఎడ్యుకేషన్: శాస్త్ర విజ్ఞానం లేకుండా మానవ జీవితానికి ప్రగతి లేదని యోగివేమన విశ్వవిద్యాలయ ప్రధానాచార్యులు ప్రొఫెసర్ టి. శ్రీనివాస్ అన్నారు. జాతీయ శాస్త్రీయ దృక్పథ దినోత్సవం సందర్భంగా వైవీయు ఎన్ఎస్ఎస్ సెల్, ఎన్ఎస్ఎస్ యూనిట్-9, జన విజ్ఞాన వేదిక - కడప సంయుక్త ఆధ్వర్యంలో యోగి వేమన విశ్వవిద్యాలయంలో ×మూఢ నమ్మకాల నిర్మూలన - శాస్త్రీయ అవగాహన్ష అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ప్రధానాచార్యులు ప్రొఫెసర్ టి. శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై అధ్యక్షత వహించారు. ఎన్ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ డా. ఎస్. వెంకట్రామిరెడ్డి ,జన విజ్ఞాన వేదిక ట్రెజరర్ రాజశేఖర్ రాహుల్ , జేవీవీ సమతా వింగ్ నేత సరస్వతి మాట్లాడారు. శాస్త్రీయ విజ్ఞానం మన జీవితంలో ఎంతో అవసరం అన్నారు. జన విజ్ఞాన వేదిక బాలబయ్యన్న నిర్వహించిన మాజిక్ షో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని కల్గించింది. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. కె. శ్రీనివాసరావు మాట్లాడారు.

కవిత్వం సమాజ హితం కావాలి



లోసారి రచించిన ఆయుధం లాంటి మనిషి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మేడిపల్లి రవి కుమార్

కడప ఎడ్యుకేషన్ : కవిత్వం సమాజ హితం కావాలని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ (ఎస్వీయూ) విశ్రాంత ఆచార్యులు డా.మేడిపల్లి రవి కుమార్ పేర్కొన్నారు. కడప బ్రౌన్ లైబ్రరీలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో లోసారి సుధాకర్ రచించిన 'ఆయుధం లాంటి మనిషి' పుస్తకావిష్కరణ సభ బుధవారం జరిగింది. ఈ సభకు సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లా కమారస్వామి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డా.మేడిపల్లి రవి కుమార్ మాట్లాడుతూ లోసారి సుధాకర్ వృత్తి రీత్యా పోలీసుశాఖలో ఏఎస్పీ గా పనిచేస్తూ కూడా తన రచనా వ్యాసంగం కొనసాగించడం కవిత్వం పట్ల ఆయనకున్న మక్కువను తెలుపుతోందన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన వైవీయూ ఆచార్య డా.ఎన్. ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో కనబడే అనేక అంశాలను కవి కళ్ళకు కట్టినట్లు తెలియజేసారన్నారు. రచయిత లోసారి మాట్లాడుతూ తాను వృత్తి పరంగా, సమాజంలో అనుభవాత్మకంగా దగ్గరగా చూసిన అనేక అంశాలే తన రచనకు ప్రేరణ అని పేర్కొన్నారు. ఆత్మీయ అతిథి ప్రముఖ న్యాయవాది సంపత్ కుమార్, గౌరవ అతిథి సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగర మోహన్, ఇంటాక్ చిన్నప రెడ్డి, వైవీయూ రాంప్రసాద రెడ్డి, బ్రౌన్ లైబ్రరీ డైరక్టర్ డా.పార్వతీ తదితరులు మాట్లాడారు.

ఘన నివాళి

కడప సెవెన్‌రోడ్స్/కోటిరెడ్డిసర్కిల్ : అచ్చ తెలుగు సరళమైన భాషలో మహా కవయిత్రి మొల్ల రామాయణాన్ని తెలుగుజాతి కానుకగా అందించిందని ఆంధ్రప్రదేశ్ తెలుగు భాషా వికాస ఉద్యమ జిల్లా అధ్యక్షులు విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు పేర్కొన్నారు. తెలుగు భాషా వారోత్సవాల సందర్భంగా బుధవారం నగరంలోని కోటి రెడ్డి సర్కిల్లోని మొల్ల విగ్రహం దగ్గర కవయిత్రి మొల్లకు, వ్యవహారిక భాష ఉద్యమ నేత గిడుగు రామమూర్తి పంతులుకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీఠం కార్యవర్గ సభ్యులు గొడుగునూరు సురేష్ కుమార్, మేకల వెంకటరమణ, సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలు విడనాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్

కడప ఎడ్యుకేషన్ : శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకుపోవడంతో పాటు మూఢనమ్మకాల నిర్మూలన చట్టం తేవాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్ డిమాండ్ చేశారు. బుధవారం కడప ఎస్వీయూ భవన్‌లో 'మూఢ నమ్మకాల నిర్మూలన చట్టం' అనే అంశంపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవిజ్ఞాన వేదిక మూఢ నమ్మకాల నిర్మూలనపై ప్రచారం చేస్తున్నా.. ఏ మతానికి వ్యతిరేకం కాదని ఏ మతంలో ఉన్న మూఢనమ్మకాలను ఆ మతం వారే నిర్మూలించి ఆ మతంలో ఉన్న అట్టడుగు వర్గాల వారిని అభివృద్ధి పథం వైపు నడిపించాలని కోరుకుంటున్నదని అన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర సలహా మండల సభ్యులు సురేష్‌బాబు, కడప జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరీ శంకర్ మాట్లాడారు.

వారసత్వ సంపద పరిరక్షణ అందరి బాధ్యత

కడప ఎడ్యుకేషన్: మన చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపదను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఇంటాక్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్, కడప చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంటాక్ ఆధ్వర్యంలో నేషనల్ హెరిటేజ్ క్విజ్ పోటీ నిర్వహించారు. ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వి. సుదర్శన రెడ్డి మాట్లాడారు. పోటీలో ఎల్. యశ్విత, జి.లోహిత్ (బాల వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్) ప్రథమ, అదితి ఆలియా, కె.చందన (నాగార్జున మోడల్ స్కూల్) ద్వితీయ, ఎస్.రెడ్డి లావణ్య, జి.నిహారిక (శ్రీ భాష్యం పబ్లిక్ స్కూల్) తృతీయ బహుమతులు పొందారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్ రంగనాథరెడ్డి, జోనల్ చైర్మన్ ఏ. వెంకటసుబ్బయ్య, సైకాలజిస్ట్ డాక్టర్ ఓ. వెంకటేశ్వర రెడ్డి, రొటేరియన్ తాజుద్దీన్, ఇంటాక్ సభ్యులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాత్సవకు సమస్యలను తెలియజేస్తున్న రవికుమార్

కడప కోటిరెడ్డిసర్కిల్ : రైల్వే ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎస్‌సీఆర్‌ఎంయూ సెక్రటరీ ఎం.రవికుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం కడపకు వచ్చిన దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాత్సవకు సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాట్‌ఫాం-2 నుంచి రైల్వే కాలనీ వరకు పుట్ ఓవర్ బ్రిడ్జి విస్తరణ చేపట్టాలని కోరారు. ఇక్కడ 100 కుటుంబాల వరకు నివసిస్తున్నాయని, అలాగే టీటీఈ గది, ఏడీఈఎన్ కార్యాలయం, పీడబ్ల్యూఐ కార్యాలయాలు ఇక్కడే ఉన్నాయన్నారు. అయితే సిబ్బంది అక్కడికి వెళ్లాలంటే రైలు పట్టాలు దాటాల్సి రావడం వల్ల అనేక ఇబ్బందులు, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఫుట్ ఓవర్ బ్రిడ్జిని కాలనీ వరకు విస్తరించాలని కోరారు. అలాగే అదనపు క్వార్టర్స్ నిర్మాణం చేపట్టాలని విన్నవించారు. ఐడీ ఆర్‌ఏటీ. ఐఆర్ ఆర్‌ఏటీ ప్రక్రియను వేగవంతం చేయడం, సిబ్బందిని రిలీవ్ చేయడం, పెండింగ్ అప్లికేషన్లు నమోదు ఆలస్యమవుతున్నాయని, అన్ని విభాగాల అప్లికేషన్లను పర్సనల్‌శాఖకు పంపించి నమోదు చేయించే విధంగా చూడాలన్నారు. అలాగే బదిలీలు, పదోన్నతులను పరిగణించాలని కోరుతున్నామన్నారు. రైల్వేకాలనీలో ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయాలని విన్నవించారు. కడప హెల్త్ యూనిట్‌లో రోగులు, సిబ్బంది తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ప్రత్యేకంగా వర్షాకాలం , శీతాకాలంలో రాత్రి పర్యవేక్షణ కోసం ఇద్దరు గ్యాంగ్‌మెన్లను నియమించాలని కోరారు. ఈ విషయంగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

'అమ్మ మనసు'ను ఆవిష్కరించిన కథలు



కేతు పద్మ రచించిన అమ్మమనసు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్ : సృష్టికి మూలమైన అమ్మ మనసును విశిష్టమైన పంథాలో కేతు పద్మ ఆవిష్కరించారని వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో బుధవారం కడప సింగపూర్ సిటీలో ఆచార్య కేతు విశ్వనాథ్ రెడ్డి సతీమణి కేతు పద్మ రాసిన 'అమ్మ మనసు' కథల సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ తన జీవితంలో ఎదురైన అనేక సంఘటనలు పద్మమ్మ కథలుగా మలచడం చాలా సంతోషమన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ మాజీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి రామముని రెడ్డి తన ప్రసంగంలో కేతు విశ్వనాథ్ రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ పద్మమ్మ కథలు రాయడం శుభ పరిణామన్నారు. విశిష్ట అతిథులుగా విచ్చేసిన ప్రసిద్ధ కథా రచయిత పాలగిరి విశ్వప్రసాద్, ఆత్మీయ అతిథులుగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార భాష సంఘం మాజీ సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య, కేతు విశ్వనాథరెడ్డి కుమారుడు శశికాంత్ రెడ్డి, జిల్లా రచయితల సంఘం సంయుక్త కార్యదర్శి భూమిరెడ్డి స్వరూపారాణి, డాక్టర్ కొప్పోలు రెడ్డి శేఖర్ రెడ్డి, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వ రాచారి మాట్లాడారు. ఈ సందర్భంగా రచయితను సన్మానించారు. కార్యక్రమంలో కందులలక్ష్మీదేవమ్మ, రమాదేవి, కరుణ, ఉమాదేవి పాల్గొన్నారు.